క్లుప్తంగా

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



బాపట్ల: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హోంలో సెమ్మీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి విజయమ్మ ముఖ్యఅతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టరు విజయమ్మ మాట్లాడుతూ అన్ని మతాలు సమానమేనని, అన్ని మతాల భావాలను గౌరవించుకోవాలన్నారు. మానవుడిగా ఈ లోకంలో పుట్టి లోక పాపాలు తనమీద వేసుకుని లోక రక్షకుడుగా క్రీస్తు అవతరించారని గుర్తు చేసుకున్నారు. క్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. క్రిస్మస్ ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నింపాలని ప్రార్థించారు. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. క్యాండిల్ లైట్ నిర్వహించారు. కార్యక్రమంలో డీఐఓ వెంకటేశ్వర్లు, ఆర్‌బీఎస్‌కె జిల్లా అధికారి డాక్టర్ సౌజన్య, డాక్టర్ భాస్కరరావు, డాక్టర్ కళ్యాణ్ గోపి, డాక్టర్ నితిన్, డాక్టర్ మౌనిక, ఎన్జీఓ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఐలవరంలో నగర సంకీర్తన



ఐలవరం(భట్టిప్రోలు): పవిత్ర ధనుర్మాస మేలుకొలుపును పురస్కరించుకుని సమరసతా సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం భట్టిప్రోలు మండలం ఐలవరం పురవీధులలో నగర సంకీర్తన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు దీవి రఘునాథచక్రవర్తి మాట్లాడుతూ ధనుర్మాసం నెల రోజులూ మహా విష్ణువును పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. బాపట్ల డివిజన్ ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, నగర సంకీర్తన సంఘం కన్వీనర్ కెబీవీ రమణ, ఫణితపు నాగులు, వి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వీడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి

తెనాలిఅర్బన్: విధి నిర్వహణలో అలసత్వం విడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 7, 19, 36 వార్డులలో మంగళవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే శానిటరీ డివిజన్ కార్యాలయాలను తనిఖీ చేసి అటెండెన్స్‌ను పరిశీలించారు. సమయానికి విధులకు హాజరు కావాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వితంతువులకు వస్త్రాల పంపిణీ

తెనాలిరూరల్: పేదలను ఆదుకోవడంలోనే క్రిస్మస్ ఉందని సినీ దర్శకుడు, పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు దిలీప్ రాజా అన్నారు. పెదరావూరు గ్రామంలోని పెన్నీ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థలో వితంతువుల కోసం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి అధ్యక్షత వహించారు. వితంతువులకు ఆయన నూతన వస్త్రాలను, నిత్యావసరాలను పంపిణీ చేశారు .కార్యక్రమములో సహాయ దర్శకులు నరేష్ దోనె, మణి చింతా తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో గ్రామాల అభివృద్ధి

ఎంపీడీఓ విజయలక్ష్మి

కొల్లిపర: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని ఎంపీడీవో వి.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి ప్రణాళికపై 3వ బ్యాచ్ కి మొదటి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ 2030వ సంవత్సరం నాటికి ప్రభుత్వం నిర్దేశించిన 9 లక్ష్యాలు, 2047వ సంవత్సరం నాటికి 17 లక్ష్యాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాల గురించి సచివాలయం సిబ్బందికి వివరించారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, మాస్టర్ ట్రైనీలు ఈవోపీఆర్డీ సి.హెచ్.భార్గవ, ఎంపీహెచ్ఓ వి.లక్ష్మి, ఐసీడీఎస్ అధికారి కె.వెంకటలక్ష్మి, ఆర్ డబ్ల్యూఎస్ ఏఈ ఆర్ సుధాకర్, ఎంపీఎం పి.రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ మూర్తి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలురే రథ సారథులు!

- వేమూరు మండలంలో ఇసుక ట్రాక్టర్లు నడుపుతున్న బాలురు
- పెసర్లంక నుంచి ఇతర గ్రామాలు, లంకలకు వారే ఇసుకను తరలిస్తున్న వైనం
- భయబ్రాంతులకు గురిచేస్తున్న డ్రైవింగ్
- పట్టించుకోని రవాణాశాఖ అధికారులు, పోలీసులు



కొల్లూరు నుంచి తెనాలి వెళుతున్న ఇసుక ట్రాక్టరును నడుపుతున్న బాలుడు

వేమూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక, ఇతర ట్రాక్టర్లను మైనర్ బాలురు నడుపుతూ హల్‌చల్ చేస్తున్నారు. వారికి డ్రైవింగ్‌పై సరైన అవగాహన లేక, నిబంధనలు తెలీక ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొల్లూరు మండలంలోని పెసర్లంక గ్రామంలో ఇసుక క్వారీ ఉండటంతో ట్రాక్టర్లు అధికంగా తిరుగుతుంటాయి. కొల్లూరు మండలంలోని కొల్లూరు, పెసర్లంక, ఆవులవారి పాలెం, చింతర్లంక, గాజులంక, జువ్వలపాలెం గ్రామాలకు చెందిన 1000 ఇసుక ట్రాక్టర్లు గ్రామంలో నడుస్తున్నాయి. ఇక్కడి నుంచి ఇసుక ట్రాక్టర్లు తెనాలి, పొన్నూరు ప్రాంతాల వరకు వెళుతుంటాయి. అయితే ఇక్కడి ట్రాక్టర్ డ్రైవర్లు తొంభైశాతం మందికి లైసెన్సులు లేవు. దాదాపుగా 70శాతం ట్రాక్టర్లను బాలురే నడుపుతుండడం గమనార్హం. 13 ఏళ్ల నుంచి 17 ఏళ్ల వయసు ఉన్న బాలురు అతి వేగంగా ట్రాక్టర్లు నడుపుతుండడంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందని ప్రజలు భయపడుతున్నారు. తనిఖీలు చేసి మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టాల్సిన అధికారులు పట్టీపట్టనట్టు వ్యవహరిస్తుండడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.

పాటలతో హోరెత్తిస్తూ..

ఇసుక ట్రాక్టర్ల యాజమానులు ప్రతి ట్రాక్టరుకు టేపు రికార్డరు ఏర్పాటు చేశారు. ట్రాక్టర్లు వెళ్లేటప్పుడు డ్రైవర్లు అధిక శబ్దంతో టేపు రికార్డుల పాటలు వింటూ మైమరిచిపోతూ అతి వేగంగా నడుపుతున్నారు. వెనుక నుంచి వచ్చే వాహనాలు ఎంత హారన్ మోగించినా ట్రాక్టర్ల డ్రైవర్లు పట్టించు కోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిళ్లు ఈ సమస్య అధికంగా ఉంటుందని గ్రామాల్లో ట్రాక్టర్ల శబ్దాలు వినలేక పోతున్నామని లంక గ్రామాలకు చెందిన ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా పోలీసులు, రవాణా అధికారులు స్పందించి గ్రామంలో మైనర్ డ్రైవింగ్‌ను అరికట్టాలని, అదేవిధంగా ట్రాక్టర్ల నుంచి అధికశబ్దం చేసే టేపు రికార్డులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై వేమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వీరాంజనేయులు వివరణ కోరగా.. ఇసుక ట్రాక్టర్లను మైనర్ బాలురు నడపతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ఇసుక ట్రాక్టర్లు మైనరు బాలురు నడపకుండా ఇకపై స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భయబ్రాంతులకు గురిచేస్తున్నారు



మండలంలో ఇసుక ట్రాక్టర్లను డ్రైవర్లు లైసెన్సులు లేకుండా నడుపుతున్నారు. ముఖ్యంగా బాలురు ఇష్టానుసారంగా నడుపుతూ భయబ్రాంతులకు గురిచేస్తున్నారు. వారి డ్రైవింగ్ చూసి భయమేస్తుంది. రవాణాశాఖ అధికారులు, పోలీసులు తనిఖీ చేసి, మైనర్లు డ్రైవింగ్ చేయకుండా అరికట్టాలి. లైసెన్సు లేకుండా ట్రాక్టర్లు నడుపుతున్న డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలి.

– కోగంటి సురేష్, జంపని

ఏకగ్రీవంగా డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు



కొల్లూరులో యలవర్తి కోటేశ్వరరావుకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న దృశ్యం

కొల్లూరు: నీటి పంపిణీ సంఘం ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల నిర్వహణాధికారులు తెలిపారు. వేమూరు, కొల్లూరు పరిధిలోని 33, 34 డీసీలకు మంగళవారం కొల్లూరు లాక్ సెంటర్‌లోని ఇరిగేషన్ కార్యాలయంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. నీటి పంపిణీ సంఘం చైర్మన్‌గా మండలంలోని చిన పులివర్రుకు చెందిన యలవర్తి కోటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా ఈపూరుకు చెందిన మల్లంపాటి హరి బాబులు ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు గెలుపు పత్రాలను ఎన్నికల నిర్వహణాధికారిణి గెలుపు పత్రాలను అందజేశారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి: సాగునీటి సంఘ డీసీగా చెరుకుపల్లి గ్రామానికి చెందిన ఆరుంబాక సాగునీటి సంఘానికి పోటీ చేసిన మోఖమాటం రాధాకృష్ణమూర్తి ఏకగ్రీవంగా మంగళవారం ఎన్నికయ్యాడు. చెరుకుపల్లి మండలంలోని ఆరుంబాక, గూడవల్లి, రాంబొట్లవారి పాలెం అమృతలూరు మండలంలోని ఇంటూరు, అమృతలూరు, గోవాడ ఈ ఆరుగురు నీటి సంఘ అధ్యక్షులు కూచిపూడి నీటి సంఘ కార్యాలయంలో రాధాకృష్ణమూర్తి ని డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షుడిగా, అమృతలూరు మండలానికి చెందిన కావూరు వెంకటేశ్వరరావు ఉపాధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎమినేని వెంకటేశ్వర్లు వ్యవహరించారు, కూచిపూడి నీటి సంఘ కార్యాలయ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దివ్యభారతి నియామక పత్రాన్ని అందజేశారు.

వేమూరులో...

వేమూరు: నీటి సంఘం అధ్యక్షులందరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా దండే సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని బాపట్ల జిల్లా వ్యవసాయ డీడీఏ విజయ నిర్మల తెలిపారు. కొల్లూరు మండల కేంద్రంలోని లాకు సెంటరులోని ఇరిగేషన్ కార్యాలయంలో వేమూరు-1 సెక్షన్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో దండే సుబ్బారావును ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని ఆమె తెలిపారు. అమర్తలూరు మండలంలో కూచిపూడి లాకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎన్నిక తెనాలి ఇరిగేషన్ కార్యాలయంలో నిర్వహించడం జరిగిందని ఎన్నికల అధికారి రామకృష్ణారెడ్డి తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా కొరటాల లీల సత్యసాయిను ఏక గ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. గోవాడ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్‌గా రాధాకృష్ణమూర్తిని ఏక గ్రీవంగా ఎన్ను కోవడం జరిగిందన్నారు.

వెల్లటూరు...

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు డిస్ట్రిబ్యూటరీ కమిటీ (35) చైర్మన్‌గా యర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు(కర్ణ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం వెల్లటూరులోని ఇరిగేషన్ శాఖ కార్యాలయంలో ఈ ఎన్నికలు నిర్వహించారు. వెల్లటూరు ఛానల్ పరిధిలోని 8 నీటి సంఘాల అధ్యక్షులు అందరూ కలసి కర్ణను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఎన్నికల అధికారిగా ఇరిగేషన్ శాఖ డీఈ జి.దీన్‌దయాళ్ వ్యవహరించారు. ఉపాధ్యక్షుడిగా వెలగపూడి రవి ప్రసాద్ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ జేఈ సువర్చల పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి విచారిస్తున్న తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు

రేపల్లె రూరల్: భూసమస్యల పరిష్కారానికై ప్రభుత్వ ఆదేశానుసారం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని సింగుపాలెం, నల్లూరుపాలెం గ్రామాలలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అనంతరం మాట్లాడారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూపరమైన సమస్యలను సదస్సుల్లో పరిష్కరిస్తామన్నారు. తమ భూములకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలలో, అడంగల్, 1బీలలో తప్పులు ఉన్నా, భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నా సదస్సుల్లో పరిష్కరించుకోవచ్చన్నారు. సమస్యలను 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాంబాబు, వీఆర్‌ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చింతాయపాలెంలో...

కర్లపాలెం: రైతుల భూముల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు దోహదపడతాయని తహసీల్దార్ సుందరమ్మ చెప్పారు. చింతాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ చింతాయపాలెం గ్రామంలో రైతుల నుంచి మొత్తం 8 అర్జీలు అందాయని చెప్పారు. రైతుల అర్జీలు పరిశీలించి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె చెప్పారు. సర్పంచ్ శ్రీనివాసరావు, వీఆర్వో సుభాని తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికా వికాసంపై అవగాహన

బాపట్ల: కిశోర బాలికలకు పౌష్టికాహారం అందేవిధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని బాపట్ల సీడీపీఓ లక్ష్మీపార్వతి పేర్కొన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈసమావేశంలో సీడీపీఓ లక్ష్మీపార్వతి మాట్లాడుతూ కిశోర బాలికల ఆరోగ్యం, పౌష్టికాహారం, విద్య, నైపుణ్యాల అభివృద్ధి, సామాజిక సాధికారిత, బాలల హక్కులు, చట్టాలపై ట్రైనర్స్ ద్వారా అవగాహన కల్పించటం జరుగుతుందని తెలిపారు. ఎంపీడీవో బాబురావు, ఎంఈఓ నిరంజన్, ఏపీఎం సురేష్ బాబు, డీసీపీఓ పురుషోత్తమరావు, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కర్లపాలెం: కిశోర బాలికలకు సమాజంపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కిశోర బాలికా వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో ఎంపీడీవో మాట్లాడుతూ బాలికలకు 100రోజుల పాటు పాఠశాలల కమిటీల ద్వారా విద్య, ఆరోగ్యం, లైంగిక వేదింపులు లాంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే బాలికల సంరక్షణకు, అవగాహనకు మండల స్థాయి గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐ రవీంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ చార్జీల భారాన్ని ఉప సంహరించుకోవాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు



మాట్లాడుతున్న నాగాంజనేయులు, పక్కన సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు

భట్టిప్రోలు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలపై మోపుతున్న విద్యుత్ ట్రూ అప్ చార్జీల భారాన్ని తక్షణం ఉప సంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు పి.నాగాంజనేయులు డిమాండ్ చేశారు. భట్టిప్రోలులోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో నాగాంజనేయులు మాట్లాడుతూ ట్రూ అప్, సర్దుబాటు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో విద్యుత్ ఛార్జీలను వడ్డిస్తున్నారని...అసలు కంటే కొసరి అధికంగా ప్రజలపై పడుతుందన్నారు. రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రాగా తీర్చిదిద్దుతామంటున్న కూటమి ప్రభుత్వం ప్రజలపై భారాన్ని మోపడం దారుణమన్నారు. పెంచిన ఛార్జీలను సత్వరమే ఉపసంహరించుకోవాలని లేకుంటే విద్యుత్ వినియోగదారులతో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ నాయకులు జి.బాలాజి, బి.శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల విధానాన్ని వ్యతిరేకిద్దాం

బాపట్ల: స్మార్ట్ మీటర్ల విధానాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఐ సీనియర్ నాయకుడు జె.బి.శ్రీధర్ పేర్కొన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా మంగళవారం సమావేశం జరిగింది. ఈసమావేశంలో జేబీ శ్రీధర్ మాట్లాడుతూ ఒకపక్క రాష్ట్రంలో తెలివిగా స్మార్ట్ మీటర్ల బిగిస్తూ పేదల నడ్డి వీరిచే స్మార్ట్ మీటర్ల విధానం అమలు చేయమంటూ కూటమి ప్రభుత్వం ప్రకటనలు ఇవ్వటం విడ్డూరంగా ఉందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించి వాటితో ప్రభుత్వం అదనంగా ప్రజలపై భారం మోపే ప్రయత్నం చేస్తుందని శ్రీధర్ దుయ్యబట్టారు. ప్రజలందరు వీటిని వ్యతిరేకించాలని, విద్యుత్ బిల్లులు పెంపుదలపై కూడా నిరసన చేపట్టాలని కోరారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బక్క రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా జిల్లా కన్వీనర్ బిజిలి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు అంకమ్మరావు, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు పొట్లూరు ఏసోబు పాల్గొన్నారు.

మహిళా మీ కోసంపై అవగాహన

తెనాలిరూరల్: జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఏర్పాటు చేసిన 'మహిళల మీ కోసం' కార్యక్రమంపై పోలీసులు మంగళవారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఎస్ఐ రాజ్యలక్ష్మి పట్టణంలో మహిళలకు ఈ కార్యక్రమం గురించి తెలియజేస్తూ రాత్రి వేళ మహిళలు ఇబ్బంది పడకూడదనే జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని తీసుకొచినట్లు చెప్పారు. జిల్లాలో రాత్రి వేళల్లో ప్రయాణించే మహిళలు 9746414641 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలిజేస్తే పోలీసులు వారికి ప్రయాణంలో అండగా ఉంటారని వివరించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి



చెత్త సేకరణ బాక్స్‌లను పరిశీలిస్తున్న కమిషనర్ జి.రఘునాథరెడ్డి

బాపట్ల: బాపట్ల పట్టణంలోని పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వివేకానందకాలనీలోని పర్కును మంగళవారం ఉదయం పరిశీలించి పలు సూచనలు చేశారు. సరస్వతి మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మరుగుదొడ్లు పరిశీలించి వెంటనే వాటి మరమ్మతులు చేయించాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులు చెత్తచెదారం సేకరించేందుకు ఏర్పాటు చేసిన ఇసుపబాక్స్‌లను పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డితోపాటు డీఈ కృష్ణారెడ్డి, ఏఈ డి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్ కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

ఫ్యాప్టో రేపల్లె కన్వీనర్ పీడీ సోషలిజం



నిరసన తెలియజేస్తున్న ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు

రేపల్లె రూరల్: విద్యార్థుల జీవితాలకు బంగారు బాటలు వేసి సమాజాభివృద్ధికి దోహదపడే ఉపాధ్యాయుల భద్రత కోసం ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఫ్యాప్టో రేపల్లె పట్టణ కన్వీనర్ పీడీ సోషలిజం అన్నారు. ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహం సెంటరులో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. సమసమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. అటువంటి ఉపాధ్యాయులపై రోజురోజుకు భౌతికదాడులు జరుగుతున్నాయని, దాడులను నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో నాయకులు ఎంవీబీ సుబ్రహ్మణ్యం, బొర్రా వేణుమాధవ్, ఎం.అంకయ్య, జొన్నలగడ్డ సుబ్బారావు, రేపల్లె పాత తాలూకాలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సేవలు ప్రశంసనీయం



విశ్రాంత ఎస్ఐ వాకా వెంకటేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న పెన్షనర్స్ సభ్యులు

చెరకుపల్లి: విశ్రాంత ఉద్యోగుల అనుభవం నేటి తరాలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని బాపట్ల జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చెరుకూరి సుబ్బారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పెన్షనర్స్ అసోసియేషన్ భవనం వద్ద జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఉల్లంగుంట శ్రీరామమూర్తి, అసోసియేషన్ అధ్యక్షుడు అల్లపర్తి ఆంజనేయులు అధ్యక్షత వహించిన సభలో సుబ్బారావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ప్రతి విశాంత ఉద్యోగి సర్వీసులో ఉన్న ఉద్యోగులకు సలహాలు, సూచనలు అందించాలన్నారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన విశ్రాంత ఉద్యోగులను అసోసియేషన్ సభ్యులు, వారి కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు రామిశెట్టి శివప్రసాద్, విశ్రాంత ఎస్ఐ బడుగు రామారావు, బ్యాంక్ ఆఫ్ బరోడా గుళ్ళపల్లి శాఖ మేనేజర్ డి.వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు చేరువ

ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని



చెరుకుపల్లిలో శిక్షణలో పాల్గొన్న సిబ్బందితో ఎంపీడీఓ సుభాని, అధికారులు

చెరుకుపల్లి: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు ప్రజా ప్రతినిధులు అధికారులతో పాటు ప్రజలు కూడా భాగస్వాములు కావాలని ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలకు ఏఆర్‌జీఎస్ సిబ్బందికి రెండోరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో ఈఓపీఆర్డీ కేజీపీ శ్రీనివాసన్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ గోపాలకృష్ణ, ఏపీఎం పి.త్యాగరాజు, కనగాల పీహెచ్‌సీ డాక్టర్ జీవనలత, స్థానిక పంచాయతీ కార్యదర్శి విజయ్ బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.ధనలక్ష్మి మండల, గ్రామ స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అంశాలపై మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు గ్రామాలను అభివృద్ధి పథంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామాలలో తాగునీరు, రహదారులు, విద్యుత్ సౌకర్యాలు మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎంపీపీ యారం వనజ, జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, ఈఓపీఆర్డి శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్, హార్టీ కల్చర్, వెటర్నరీ, ఎనర్జి, ఫిషరీస్ అసిస్టెంట్లతో పాటు మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.


భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: గ్రామాల సుస్థిర అభివృద్ధే ధ్యేయంగా శిక్షణను సద్వినియోగం చేసుకుని అందరూ కలసికట్టుగా పని చేయాలని మాస్టర్ ట్రైనర్ ఎ.చినవెంకటేష్ బాబు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో ఎల్ఎస్‌డీజీ పై రెండవ బ్యాచ్‌కు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వీఆర్వోలు, అగ్రికల్చర్, వెల్ఫేర్, ఎనర్జీ, ఫిషరీస్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, గ్రామ సర్వేయర్లు, ఏఎన్ఎంలకు శిక్షణా తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా చిన వెంకటేష్ బాబు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో సరైన ప్రణాళికలు రూపొందించుకుని అభివృద్ధికి పాటు పడాలని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయిలో 2015-2030 మధ్య కాలంలో ఐక్యరాజ్య సమితి నిర్దేశించినటువంటి లక్ష్యాలను స్థానికంగా అమలు చేయాలనే అంశంపై శిక్షణను మాస్టర్ ట్రైనర్లు జి.శ్రీమన్నారాయణ, ఏపీఎం (భట్టిప్రోలు), వక్కలగడ్డ సురేష్, పంచాయతీ కార్యదర్శి (రాచూరు)లు ఇచ్చారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరుపీధుల ఉదయభాస్కరిలు మాట్లాడుతూ గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్య సాధనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్. వెంకట రమణ, ఈవోపీఆర్డీ టి.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

కొల్లూరు: భర్తతో విభేదాల కారణంగా ఓ వివాహిత తన కుమార్తెను తీసుకొని అదృశ్యమైన సంఘటన కొల్లూరులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. కొల్లూరు ఎస్సీ కాలనీకి చెందిన ఈపూరు మనోహర్‌కు తన భార్య నాగమల్లేశ్వరికి మధ్య కొన్ని రోజులుగా విభేదాలు తలెత్తాయి. భార్య, భర్తల మధ్య గొడవలు జరుగుతుండటంతో ఈనెల 14న తన 9 ఏళ్ల కుమార్తె యక్షితను తీసుకొని ఇంటి నుంచి అదృశ్యమైంది. అప్పట్నుంచి భర్త, బంధువులు పలు ప్రాంతాలలో ఆమె కోసం గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం కొల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త మనోహర్ ఫిర్యాదు మేరకు కొల్లూరు ఎస్ఐ జి. ఏడుకొండలు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



తెనాలిఅర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, వైష్ణవి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావులు పేర్కొన్నారు. ఏబీవీపీ తెనాలి శాఖ నగర అధ్యక్షుడు పాటిబండ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని వైష్ణవి జూనియర్ కళాశాలలో మంగళవారం మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే అందరూ సేవా భావం కలిగి ఉండాలన్నారు. సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఏబీవీపీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తెనాలికి చెందిన వేదశ్రీ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేశారు. అలాగే వేదశ్రీని సన్మానించారు. కార్యక్రమంలో చైతన్య కళాశాల డీన్ తిరుపతిరావు, ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, ఎన్ఆర్ఐ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, ఏబీవీపీ విభాగ కన్వీనర్ ప్రసాద్, లోకేష్ పాల్గొన్నారు.